క్లుప్తంగా

యువతరమే దేశ భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

విశాఖ సిటీ: భారతీయ యువత దేశ భవితగా నిలుస్తారని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. యువతరం విలువైన మానవ వనరులుగా నిలవాలని సూచించారు. కళాశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయిస్తూ సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపాలని పిలుపునిచ్చారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ దేశ జనాభాను ముఖ్యంగా యువతను సమాజానికి ఉపయుక్తంగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకతను వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్య, వైద్యం, మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యాన్ని తెలియజేశారు. తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు అన్నవరపు చంద్రమోహన్ జనాభా వృద్ధి, పర్యవసానాలు, పరిష్కారాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రి వైద్యుడికి అరుదైన గౌరవం



డాక్టర్ రాజేష్ వెంకట్

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రి వైద్యుడికి అరుదైన గౌరవం లభించింది. అపోలోలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, స్ట్రోక్ మేనేజ్‌మెంట్ నిపుణుడు డాక్టర్ రాజేష్ వెంకట్ ఇందాలకు అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (ఏఏఎన్) ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్‌కు ఎంపిక చేసింది. విశాఖలో అతి చిన్న వయసులో ఈ ఫెలోషిప్‌కు ఎంపిక కావడం విశేషమని అపోలో వైద్యులు డాక్టర్ రాజేష్ వెంకట్‌ను శుక్రవారం అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా న్యూరాలజీ రంగంలో అసాధారణ కృషి చేసిన వారికి ఈ ఫెలోషిప్ లభిస్తుందని తెలిపారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ తన సేవలను గుర్తించడం ఆనందంగా ఉందని డాక్టర్ రాజేష్ వెంకట్ అన్నారు.

కృష్ణా కళాశాలలో జనాభా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: విద్యావంతులు, ఆరోగ్యవంతులైన జనాభా దేశాభ్యున్నతికి దోహదపడుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు అన్నారు. శుక్రవారం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జయ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రాజేశ్వరరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. రవిబాబు, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ లక్ష్మి, ఎన్ఆర్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏఎల్ రూపవాణి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి. ధనలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి. ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి. లక్ష్మి, డాక్టర్ కె. సుభాషిణి, బి. రాజారావు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



పవన్‌కృష్ణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పీఎస్ పరిధిలోని కేఆర్ఎం కాలనీలో కోరాడ పవన్‌కృష్ణ భార్య కోరాడ లక్ష్మి, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. ఓ సంస్థలో డైలీ ఫైనాన్స్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తలకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 10న లక్ష్మి తన పిల్లలను తీసుకొని ఆర్కే బీచ్‌కు వెళ్లి సాయంత్రం 6.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. పవన్‌కృష్ణ కనిపించలేదు. బంధుమిత్రుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. భర్త అదృశ్యంపై ఎంవీపీ పీఎస్‌లో లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు.. రిమార్కు



15వ వార్డు హెచ్‌బీకాలనీలోని జీవీఎంసీ పార్కు ముఖ ద్వారం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా హెచ్‌బీకాలనీ జీవీఎంసీ పార్కు
- నిర్వహణ లోపంతో అధ్వాన పరిస్థితులు
- వెళ్లేందుకు భయపడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



పార్కు గేటు పక్కనే కుప్పలుగా మద్యం సీసాలు, చెత్తా చెదారం



శుభ్రతకు నోచుకోని పార్కు లోపలి ప్రాంగణం

మద్దిలపాలెం: నలుగురికీ ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయింది. చీకటి పడితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తోంది. రోజూ ఉదయం, సాయంత్రం వచ్చే వాకర్లను ఇబ్బందులకు గురిచేస్తోంది. పార్కు చుట్టూ బ్రాందీ, బీరు సీసాలు, తాగి పడేసిన గ్లాసులు, తిని విసిరేసిన చెత్తా చెదారంతో రోత పుట్టిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో గల జీవీఎంసీ పార్కు దుస్థితి. ఈ పార్కు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారింది. పార్కు చుట్టు పక్కల అంతా ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది.



పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

రాత్రి అయితే చాలు.. ఆకతాయిల అల్లర్లు..

సరైన పర్యవేక్షణ లోకపోవడం, కాలనీ దూరంగా ఉండడంతో ఈ పార్కు ఆకతాయిలకు నిలయంగా మారిపోయింది. రాత్రి అయితే చాలు గుంపులు గుంపులుగా ఆకతాయిలు ఇక్కడికి చేరుకుంటారు. మద్యం సేవిస్తూ, సిగరెట్లు తాగుతూ నానా గందరగోళం చేస్తుంటారు. పార్కు చుట్టు పక్కల ఎక్కడ చూసినా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. పార్కులో ఎక్కడ పడితే అక్కడ చెత్తా, చెదారం, తాగిపడేసిన మందు బాటిళ్లు, గ్లాసులు, ఖాళీ చిప్స్ ప్యాకెట్లతో పరిసరాలు ఆధ్వానంగా ఉన్నాయి. దీంతో చాలా వరకూ పార్కుకు జనం రావడం మానేసారు. ఇదే అదనుగా ఆకతాయిలు చీకటి పడితే చాలు చెలరేగిపోతున్నారు. గొడవలు పడుతూ చుట్టు పక్కల వారికి ఇబ్బంది కలిగిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న వాకర్లు..

వార్డులో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వాకర్లు వస్తుంటారు. ఇక్కడ వాకర్స్ క్లబ్ ఉంది. అయితే సరైన పర్యవేక్షణ, నిఘా లేక నిర్వహణ లోపంతో పార్కు అస్తవ్యస్తంగా మారింది. మొక్కలు నాటి, కూర్చోవడానికి బెంచీలు, పిల్లల ఆటపరికరాలు అమర్చారు. మొక్కలకు నీటి సౌకర్యం, లైటింగ్, చుట్టూ ప్రహరీ వంటి సదుపాయాలు ఉండడంతో ఈ పార్కు సందర్శకులతో కళకళలాడేది. అయితే ఆ వైభవం మూడు నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

కొరవడిని పోలీసు గస్తీ..

హెచ్‌బీ కాలనీలో కాలనీకి దూరంగా ఉన్న ఈ ప్రాంతంలో పోలీసుల రాత్రి గస్తీ సైతం కొరవడింది. దీంతో ఎవరూ ఇక్కడికి రారు అనే ధీమాతో ఆకతాయిలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ఎప్పుడైనా వచ్చే పోలీసులు ఆ క్షణానికి హడావిడి చేసి వెళ్లిపోతున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కుకు వెళ్లాలంటే భయమేస్తోంది..

పార్కు వల్ల చుట్టు పక్కల చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. చీకటి పడితే మందుబాబులు పార్కులో మద్యం తాగి గొడవ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పిల్లల్ని పార్కుకు పంపాలన్నా, ఆడవాళ్లు వెళ్లాలన్నా భయమేస్తోందంటున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు.

'మా ప్రాంతానికి అదనంగా రోడ్డు అవసరం లేదు'

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో అదనంగా రోడ్డు నిర్మాణం అవసరం లేదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ది విశాలాక్షినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీతకొండను ఆనుకొని 60 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారని, దాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. దీంతో పాటు విశాలాక్షినగర్‌లో రెవెన్యూ పార్కు పునరాభివృద్ధికి జీవీఎంసీ అధికారులతో చర్చిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం అందించిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి వి.సింహాద్రిరావు, రెవెన్యూ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి ఎం.మధుసూదనరావు, రిటైర్డ్ స్పెషల్ గేరడ్ డిప్యూటీ కలెక్టర్ టి.కామేశ్వరరావు, కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు, పలువురు విశ్రాంతి తహసీల్దార్లు ఉన్నారు. ఇదిలా ఉండగా అభివృద్ధి పనులు కావాలని కోరుకుంటున్న సమయంలో మా కాలనీకి రోడ్డు నిర్మాణం అవసరం లేదంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

క్షత్రియ మహాసభ అధికార ప్రతినిధిగా శ్రీనివాసవర్మ



శ్రీనివాసవర్మ

ఎంవీపీకాలనీ: అఖిల భారతీయ క్షత్రియ మహాసభ అధికార ప్రతినిధిగా దాట్ల శ్రీనివాసవర్మ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు కున్వార్ అవినాష్ సింగ్ గురువారం ప్రకటనలో విడుదల చేశారు. శ్రీనివాసవర్మ రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. దక్షిణ భారతదేశంలో అఖిల భారతీయ క్షత్రియ మహాసభ నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన తప్పనిసరి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడతూ గర్భిణులకు పోషకాహార ప్రణాళిక గురించి తెలియజేయాలన్నారు. అలాగే నిర్దేశించిన సమయంలో వ్యాక్సినేషన్ చేయించాలని తెలపాలన్నారు. జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ టీనేజీలో గర్భం దాల్చకుండా చూసుకోవాలని, వివాహ వయస్సు 20 సంవత్సరాలు దాటితే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి బి.విజయలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నివాణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, వైద్య ఆరోగ్యశాఖ పలు విభాగాల ప్రాజెక్టు అధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ ఎన్.వి.సమత, శశిభూషణ్, మలేరియా నివారణ, టీబీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏయూ నార్త్ క్యాంపస్‌లోని అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహాల ప్రాంగణంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏయూ హార్టీ కల్చరల్ గార్డెనింగ్ విభాగం ప్రత్యేకంగా వివిధ పండ్ల జాతులు, దీర్ఘ కాలం జీవించే మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చుట్టూ రక్షణ కంచె సైతం ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు అందించిన వీసీటీపీఎల్ అధికారులను ఏయూ వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో వీసీటీపీఎల్ టెర్మినల్ హెడ్ కెప్టెన్ సుదీప్ బెనర్జీ, వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్-అడ్మిన్) ఎం.ఎస్.రావు, పీఆర్-సెక్యూరిటీ విభాగం సీనియర్ జనరల్ మేనేజర్ జిత, ఆపరేషన్ విభాగం హెడ్ మధు, రిక్రూట్‌మెంట్ హెడ్ కుమార్, ఏయూ హార్టీ కల్చరల్ విభాగం డీన్ ఆచార్య ఎస్.బి. పడాల్, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్యా దీపిక, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య యుగంధర్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ ప్రారంభమెప్పుడో..?



ఆరిలోవలో నిర్మించిన రైతుబజార్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో రైతుబజార్ నిర్మాణం పూర్తయినా.. నేటికీ అధికారులు ప్రారంభించకుండా వదిలేశారు. ఎంతో విశాలం, లక్షకు పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో రైతుబజార్ అత్యవసరం. రైతుబజార్ కోసం స్థానిక ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంతవరకు ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు ఇదిగో అదుగో అంటూ మాయమాటలతో ఆరిలోవ ప్రజలను బురిడీ కొట్టించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2022లో ప్రస్తుత మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆరిలోవకు రైతుబజార్ కోసం కృషి చేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ నిధులతో తోటగరువు హైస్కూల్ పక్కన అరెకరం స్థలంలో రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి సుమారు 80 శాతానికి పైగా పనులు జరిపించారు. అప్పటి నుంచి కూటమి పాలనలో ఇంత వరకు ఈ రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురాలేకపోవడం విశేషం. సుమారు రెండు నెలల కిందట దీని పనులన్నీ పూర్తయ్యాయి. దీన్ని ప్రారంభించకుండా దిష్టబొమ్మలా వదిలేశారు. దీన్ని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ఆరిలోవ ప్రజలు మార్కెటింగ్ శాఖ అధికారులను కోరుతున్నారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ వద్దు



శతాబ్ది వాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

విశాఖ సిటీ: పరిశోధనల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రారంభమైన 'శతాబ్ది వాణి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తూ, స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలన్నారు. పరిశోధన గ్రంథ రచనను సరళంగా, ఆసక్తిదాయకంగా ఎలా చేయాలో వివరించారు. డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను వర్సిటీకి ఆహ్వానిస్తున్నామని, దీని ద్వారా విద్యా సంబంధిత వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నెల 17న రెండో 'శతాబ్ది వాణి' ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య పద్మశ్రీ, ఆచార్య సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనందగజపతిరాజు, బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్ డాక్టర్ సాల్మన్ బెన్నీ సహా పలువురు విభాగాధిపతులు, పరిశోధకులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



28వ వార్డులో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో శుక్రవారం వీధి లైట్లు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ కౌన్సిల్‌లో వీధి దీపాల సమస్యపై చర్చించడంతో జీవీఎంసీ అధికారులు అవసరమైన చోట విద్యుత్ దీపాలను సిబ్బంది ద్వారా ఏర్పాటు చేయించారు. దీంతో ఈ వార్డు విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆడారి అశోక్‌కుమార్(34) అనే వ్యక్తి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆడారి అశోక్‌కుమార్ తన భార్య అలేఖ్య, తండ్రి ఆడారి కృష్ణతో కలిసి వెంకోజీపాలెంలో నివసిస్తున్నాడు. అతడికి నాలుగేళ్ల బాబు ఉన్నాడు. గతేడాది తల్లి మరణంతో కుంగిపోయిన అశోక్‌కుమార్ కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ నెల 10వ తేదీ గురు పౌర్ణమి కావడంతో కుటుంబ సభ్యులంతా సాయి మందిరానికి వెళ్లారు. మధ్యాహ్నం 1.10 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోర్‌కు తాళం వేసి ఉంది. తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని అశోక్‌కుమార్ కనిపించాడు. అతడిని కిందకు దించి మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతుడి తండ్రి ఆడారి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 11 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 11 వినతులు అందాయి. చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పొగాకు నిర్మూలనకు సంతకాల సేకరణ



పొగాకు నిర్మూలన కోరుతూ సంతకం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పొగాకు నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సంతకం చేశారు. పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, వ్యసనాల దుష్పరిణామాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఉద్యోగి పొగాకు నిర్మూలనకు కట్టుబడి పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ బాల వీరాంజయనేయ స్వామికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం: సిక్స్ మాన్ కమిటీ ద్వారా యూనివర్సిటీలో అడుగు పెట్టిన అతిథి అధ్యాపకులందరికీ సంబంధించి వీసీ ఆచార్య జీ.పి. రాజశేఖర్ విడుదల చేసిన వెబ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్ మీనన్ ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. అతిథి అధ్యాపకులందరినీ రెన్యువల్ చేయాలని ఇన్‌చార్జి మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అతిథి అధ్యాపకులకు రెన్యువల్ లేదా రివ్యూస్ నిర్వహించటానికి ఎటువంటి పరిస్థితిలో అభ్యంతరాలు లేవని వివరించారు. యూజీసీ నిబంధనల ప్రకారం గంటకి రూ.1500 చొప్పున నెలకు రూ. 50 వేలు ఇవ్వొచ్చని యూజీసీ నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్ ప్రతాప్ శిరీష్, విక్రమ్ శ్యాం సుందర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వేతనాలు కోరుతూ బైక్ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: ప్రస్తుత ధరల ప్రకారం ఒక కుటుంబం బతకడానికి కనీసం రూ. 26 వేలు ఖర్చు అవుతుందని, కానీ కేవలం రూ. 13 వేలతో పట్టణాల్లో ఎలా జీవించాలని ప్రభుత్వాన్ని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 12వ తేదీ నుండి సమ్మె చేస్తున్న సందర్భంగా శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకత్వంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి అప్పటి ధరల ప్రకారం డీఏతో కూడిన వేతనాలు నిర్ణయించాలన్నారు. జీవో 36 ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 21 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ. 24,500 చెల్లించాలన్నారు. కార్మిక వర్గం అంతా సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ బైక్ ర్యాలీలో ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గండి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరాజు, జాయింట్ సెక్రెటరీ మహేష్, కోశాధికారి కె. వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ రాజు, జాయింట్ సెక్రెటరీ గండి రమణ, వైస్ ప్రెసిడెంట్ మహేష్, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికుటి రాజు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో క్రైస్ట్ చర్చ్ ప్రారంభం



క్రైస్ట్ చర్చ్‌ను ప్రారంభిస్తున్న జాన్‌వెస్లీ

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని వుడా కాంప్లెక్స్‌లో సంఘ కాపరి ఎస్.హనీ జాన్సన్ ఆధ్వర్యంలో జీసెస్ ఓన్ బ్లడ్ క్రైస్ట్ చర్చ్ అనే సంఘాన్ని శుక్రవారం ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఈ సంఘం విశాఖలోని ఇతర సంఘాలకు ఒక మాదిరిగా నిలవాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక క్రైస్తవులపై దాడులు పెరిగాయని, వాటిని అందరం ప్రార్థన ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో క్రైస్తవులందరికీ ఎంతో మేలు జరిగిందనే విషయాన్ని ప్రతి క్రైస్తవుడు గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్య ప్రసంగీకుడు బిషప్ ఎంఏ పాల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు దైవగుణాలను, క్రైస్తవ సిద్ధాంతాలను ఏ విధంగా అనుసరించాలో తెలియజేశారు. సభాధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సుధాకర్ పాల్ మాట్లాడుతూ నూతన ప్రార్థనా మందిరం ఆత్మలను రక్షించే విధంగా ముందుకెళ్లాలని కోరారు. బ్రదర్ జేమ్స్ వీకే కుంపట్ల వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్ డేనియల్, శ్యామ్ ఆనంద్, క్రైస్తవ నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.